కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

జనగామ పట్టణంలో వరదను పరిశీలిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లోలెవల్ వంతెనలు, కాజ్‌వేలు, వరద ప్రవాహం ఏర్పడే ప్రాంతాల మీదుగా రాకపోకలు కొనసాగించొద్దన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దన్నారు. జిల్లాలోని చెరువులు, కుంటల్లో చేరుతున్న వరద ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షించడంతో పాటు పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీలు, మ్యాన్ హోల్స్ కూరుకుపోయి వర్షపు నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా అధికారులు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. శిధిల భవనాల్లో, వర్షాలకు తడిసిన మట్టి గోడ ఇండ్లలో ప్రజలు ఉండొద్దని ఆయన సూచించారు. తడిసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్స్ , స్తంభాల వద్దకు ప్రజలు వెళ్లొద్దన్నారు. అత్యవసర పనులుంటేనే బయటకి రావాలని, లేకుంటే ఇంటిపట్టునే ఉండాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 9052308621కు కాల్ చేసి ప్రజలు తమ సమస్యలను తెలుపాలని కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే పల్లా

జనగామ, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదు కావడం, మళ్లీ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు యంత్రాగం సిద్ధంగా ఉండాలని, వరద ఉధృతితో ప్రమాదాలకు అవకాశం ఉండటంతో యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. పలుచోట్ల వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండగా చెరువులు, కుంటలు, చెక్‌డ్యాములు నిండిపోయి మత్తడి దుంకుతుండటంతో నీటి ప్రవాహాన్ని దాటాలనే సాహసం చేయడం ప్రమాదకరమని ఎమ్మెల్యే హెచ్చరించారు.

పీఆర్‌టీయూ మండల కార్యవర్గం ఎన్నిక

అనిల్

సంతోష్‌కుమార్

బచ్చన్నపేట, సెప్టెంబర్ 1 : పీఆర్‌టీయూ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం రాష్ట్ర నాయకుడు పాశికంటి యాదగిరి నేతృత్వంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రామవజ్జుల అనిల్, ప్రధాన కార్యదర్శిగా సంతోష్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా రవీందర్,కార్యదర్శిగా నరేంద్రచారి, మహిళా ఉపాధ్యక్షురాలిగా మంగ, కార్యదర్శిగా కృష్ణకళ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల ఎల్లారెడ్డి, నోడల్ అధికారి వెంకట్‌రెడ్డి, డీపీఎల్ మూర్తి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడి మృతికి సంతాపం

తరిగొప్పుల, సెప్టెంబర్ 1 : మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు గాజుల రాజు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పింగిళి జగన్‌మోహన్‌రెడ్డి మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో దామెర ప్రభుదాసు, చెన్నూరి సంజీవ, తాళ్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, అంకం రాజారాం, వంగ రామరాజు, భూస యాదయ్య, నేతుల సత్తయ్య పాల్గొన్నారు.

యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా రమేశ్

రఘునాథపల్లి, సెప్టెంబర్ 1: యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా మండలంలోని కుర్చపల్లికి చెందిన తోటకూర రమేశ్‌ను నియమిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు తాటికొండ వెంకటేశ్‌యాదవ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం నియామక పత్రాన్ని రమేశ్‌కు అందించారు. రమేశ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రెడ్డి సంఘం గ్రామ అధ్యక్షుడిగా రవీందర్‌రెడ్డి

బచ్చన్నపేట, సెప్టెంబర్ 1 : మండలంలోని ఆలింపూర్ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మాజీ సర్పంచ్ గూడ రవీందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా గంట తిర్మల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పోరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గంట తిరుపతి రెడ్డి, కోశాధికారిగా తొగిటె బాల్‌రెడ్డిని ఎన్నుకున్నట్లు తెలిపారు.



నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-318996

BUSINESS OFFER

★చాలా పెద్ద చదువులు చదువుకున్న నిరుద్యోగ యువతీ, యువకులకు సువర్ణావకాశం. అతి తక్కువ పెట్టుబడితో ప్రతి నెల అత్యధికంగా సంపాదించుకునే సువర్ణావకాశం. సంప్ర: సెల్: 9502940056.
NTW-326315

WANTED HOSPITAL STAFF

★Pharmacy Boys, Operation Theater Boys & Receptionist / సిస్టమ్ ఆపరేటర్స్ కావలెను. సంప్ర: గార్డియన్ హాస్పిటల్, ములుగు 'X' రోడ్, వరంగల్. 12 to 2 PM.
NTW-0418

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

జనగామలోని హైదరాబాద్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

రఘునాథపల్లిలో వరదను పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

ఉధృతంగా ప్రవహిస్తున్న పెదమడూరు చెక్‌డ్యాం

బచ్చన్నపేటలో వాగును పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

దంచికొట్టిన వాన

- జిల్లాలో రెండు రోజులుగా భారీ వర్షాలు
- కొడకండ్లలో అత్యధికంగా 27.26 సెం.మీ
- రఘునాథపల్లిలో నీట మునిగిన హైవే
- వరదలతో పొంగుతున్న వాగులు, వంకలు
- ఆదివారం కురిసిన సగటు వర్షపాతం 10.72 సెం.మీ
- దేవరుప్పలలో 13.84 , జఫర్‌గడ్‌లో 15.06 సెం.మీ నమోదు
- జనగామ-హుస్నాబాద్‌కు రాకపోకలు బంద్
- జిల్లా కేంద్రంలో హైవేను ముంచెత్తిన వరద, కాలనీల్లోకి నీరు

వెల్దండ- అమ్మాపురం రోడ్డుపై వరద నీరు

తరిగొప్పులలో వరదను మళ్లిస్తున్న అధికారులు

వడ్లకొండ క్రాస్ రోడ్డు వద్ద తెగిన వంతెన

జనగామ, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి రాకపోకలు నిలిచిపోయాయి. వరంగల్-హైదరాబాద్ మార్గంలో రఘునాథపల్లి మండల కేంద్రంలో హైవేపై వరదనీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు కొద్దిసేపు ఆటంకం కలిగింది. జనగామ-హుస్నాబాద్ మార్గంలో వడ్లకొండ రోడ్డుపై నిర్మిస్తున్న కల్వర్టు, తాత్కాలిక కాజ్‌వే కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. రంగప్పచెరువు మత్తడి నీరు జనగామ పట్టణంలోని పలు కాలనీలను ముంచెత్తింది. జనగామ-హైదరాబాద్ ప్రధాన రహదారిపై ప్రవహించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పట్టణంలోని వరదముంపు ప్రాంతాన్ని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుతో కలిసి సందర్శించారు. వరద మళ్లింపునకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో రెండు రోజులుగా 12.864 సెం.మీ వర్షపాతం నమోదైతే ఆదివారం ఒక్కరోజునే 10.72 సెం.మీ సగటు వర్షపాతం నమోదైంది. కొడకండ్లలో అత్యధికంగా 27.26 సెం.మీ, దేవరుప్పులలో 13.84, జఫర్‌గడ్ మండలంలో 15.06 సెం.మీ కురిసింది. పాలకుర్తిలో 10.22 సెం.మీ, నర్మెటలో 9.14, బచ్చన్నపేటలో 8.56, చిల్పూర్‌లో 8.46, జనగామలో 8.28, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 7.28, తరిగొప్పులలో 7.02, రఘునాథపల్లిలో 6.96, లింగాలఘనపురంలో 6.56 సెం.మీ వర్షం కురిసింది. రెండు రోజులుగా రాత్రిపూట కురిసిన వానలతో ఎగువ నుంచి వరద ఉధృతి పెరగడంతో ముందుజాగ్రత్తగా అధికారులు దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. మరోవైపు పెద్దపహాడ్ ఏనె చెరువు, వడ్లకొండ, గానుగపహాడ్ తదితర చెరువులు, కుంటలు మత్తళ్లు దుంకుతున్నాయి. జిల్లాలోని పలుచోట్ల వరినాట్లు, పత్తి చేలల్లోకి వరదనీరు చేరడంతో పంట నీటమునిగింది. పాలకుర్తి, లింగాలఘనపురం, దేవరుప్పుల మండలాల్లో వాగులు, చెక్‌డ్యాములు, కల్వర్టులు పొంగి ప్రహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. చెరువులు, కుంటలు, వాగులపై చెక్‌డ్యాములు నిండి మత్తడి పోస్తుండగా, దేవాదుల జలశయాల్లోకి భారీగా వరదనీరు చేరుతున్నది. రాబోయే 48 గంటలపాటు వానలు కొనసాగే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం రెడ్ అలర్ట్ ప్రకటించింది. పునరావాస, రిలీఫ్ కేంద్రాలను సిద్ధం చేసుకొని అవసరమైతే ప్రజలను తరలించేందుకు సిద్ధమైంది.

అక్రమ కట్టడాల వల్లే ముంపు..

ప్రభుత్వాలు, పాలకులు మారిన జనగామ పట్టణ ప్రజల కష్టాలు తీరడంలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ రోడ్డులోని సెయింట్‌మేరీ స్కూల్ వద్ద వరద నీరు ఉధృతిపై గతంలో ఇచ్చిన అక్రమ నిర్మాణాలకు ఇచ్చిన అనుమతులను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రాంతానికి రంగప్పచెరువు వరద నీరు వచ్చి గార్లకుంటలోకి పోతున్న దృష్ట్యా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, గ్రీన్ బెల్ట్ మార్కింగ్ చేసి వరదనీటికి అడ్డుగా ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని కోరుతున్నారు. హైడ్రా తరహా జనగామలో చర్యలు తీసుకొని హైదరాబాద్ రోడ్డు ముంపునకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

జనగామలో దంచికొట్టిన వాన

జనగామ చౌరస్తా : జనగామ పట్టణంలోని రంగప్ప చెరువు నుంచి వరదలు పోటెత్తడంతో బీరప్పగడ్డ, కుర్మవాడ, బాలాజీ నగర్, వీవర్స్ కాలనీ, గిర్నిగడ్డ, అంబేద్కర్ నగర్, బతుకమ్మ కుంట కాలనీలోని ఇళ్లలోకి వరద నీరు చేరుకుంది. హైదరాబాద్ రోడ్డు మార్గంలో డ్రైనేజీలు పొంగిపొర్లడంతో ప్రధాన రహదారిపై వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో ఈ మార్గం లో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ఆర్వోబీ కిందున్న అండర్ బ్రిడ్జితో పాటు వీవర్స్ కాలనీ వద్ద కొత్తగా నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి వరదలొచ్చాయి. పలుచోట్ల చెట్లు నేలకూలగా, కరెంట్ స్తంభాలు, వైర్లు తెగిపడ్డాయి. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను, మట్టి జేసీబీల సహాయంతో ఏరివేసి రహదారిపైకి చేరుకున్న వరద నీటిని తొలగించారు.

నర్మెటలో..

నర్మెట : వర్షాలతో నర్మెట-జనగామ రహదారిపై హన్మంతాపూర్ వద్ద రోడ్డుపై వరద ఉధృతి పెరగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నర్మెట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోకి వర్షపు నీరు చేరి చెరువును తలపిస్తుంది. వెల్దండలో నాగుల చెరువు మత్తడి పడుతుండడంతో వరద నీటితో రోడ్డు కుంగిపోయింది. దీంతో రాకపోకలు నిలిపివేశారు. అమ్మాపురం వెల్దండ గ్రామాల మధ్య రోడ్డుపై వరదలో బైక్‌తోసహా ఓ యువకుడు కొట్టుకుపోగా గమనించిన స్థానికులు అతడిని రక్షించారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట : వర్షాలతో బచ్చన్నపేటలోని ఎల్లమ్మ ఆలయం కల్వర్టు, కేశిరెడ్డిపల్లి కల్వర్టు వద్ద వరద ఉధృతి పెరగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు చెరువుల్లోకి వర్షపు నీరు చేరుతుండడంతో చేపలు ఎదురెక్కుతున్నాయి. దీంతో చేపటేందుకు స్థానికులు పోటీ పడుతున్నారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో నివాసముంటున్న వారిని ఖాళీ చేయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అత్యవసరమైతేనే బయటకు రావాలని నర్మెట సీఐ సాయిరమణ అన్నారు. బచ్చన్నపేటలోని నక్కవానిగూడెం రోడ్డులోని కల్వర్టును ఎస్సై సతీశ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. విద్యుత్ స్తంభాలకు వద్దకు వెళ్లొద్దని సూచించారు.

లింగాలఘనపురంలో..

లింగాలఘనపురం : మండలంలోని పటేల్ గూడెం వద్ద తాత్కాలింకంగా ఏర్పాటు చేసిన రోడ్డు కొట్టుకపోయి వరదలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నెల్లుట్ల-కుందారం రూట్‌లో రవాణా సౌకర్యం నిలిచిపోయింది. పటేల్‌గూడెం, కుందారం చెరువులు అలుగు పోసేందుకు సిద్ధంగా ఉన్నాయి. ప్రజలు అప్రత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

రఘునాథపల్లిలో..

రఘునాథపల్లి : భారీ వర్షాలకు మండలంలోని కోడూరు, గబ్బెట, కంచనపల్లి, మండెల గూడెంలోని చెరువులు మత్తడి పోస్తున్నాయి. కోడూరు పెద్ద చెరువు మత్తడితో కోడూరు-పాలకుర్తికి వెళ్లే రహదారిపై వరదలు పెరిగి రాకపోకలు నిలిచిపోయాయి. అటువైపు ఎవరూ వెళ్లకుండా ట్యాంకర్‌ను అడ్డుపెట్టారు. రఘునాథపల్లిలోని ఆర్‌వీఎస్ కాంప్లెక్స్ వద్ద హైదరాబాద్-వరంగల్ హైవేపై వరదలకు అరగంట సేపు వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై నరేశ్‌యాదవ్ జేసీబీలతో డివైడర్‌ను తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. వీరిని జనగామ డీసీపీ రాజామహేంద్రనాయక్ అభినందించాడు. అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున ప్రజలు ఇళ్లలో ఉండాలని కోరారు. మరోవైపు వరద ప్రాంతాలను అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ పరిశీలించారు.

దేవరుప్పలలో..

దేవరుప్పుల : వర్షాభావం నెలకొని వరి చేన్లు ఎండుతున్న తరుణంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరదలు పోటెత్తి చెరువులు నిండుతున్నాయి. మండలంలో 13 సెం.మీ వర్షం కురిసింది. కోలుకొండ నుంచి గొల్లపల్లి వరకు వాగుపై ఉన్న తొమ్మిది చెక్‌డ్యాములు నిండి అలుగులు పోస్తున్నాయి. పొలాల్లో నీరు చేరగా, పత్తి చేన్లు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. రామచంద్రాపురం వాగు మత్తడి పోయడంతో ఇటు కోలుకొండకు, అటు పాలకుర్తికి వెళ్లే మార్గాలు మూసుకుపోయాయి. మండల ప్రత్యేకాధికారి రాము, తహసీల్దార్ హుస్సేన్, ఎస్సై సృజన్‌కుమార్ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. వాగులు, చెరువుల వద్దకు చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. కొన్ని చోట్ల రోడ్లపై చెట్లుకూలగా స్థానికులు తొలగించారు.

తరిగొప్పులలో..

తరిగొప్పుల : మండల కేంద్రానికి రాకపోకలు సాగించే ప్రధాన రహదారిపై ఉన్న చెరువులు మత్తడి పోస్తుండడంతో కందకాలు ఏర్పడ్డాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్నది. ఈ క్రమంలో తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎస్సై శ్వేత సహాయం చర్యలు చేపట్టారు. తరిగొప్పుల- జనగామకు రహదారి బట్టల బజార్ సమీపంలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో జేసీబీతో పూడిక తీయించి నీటిని మళ్లించారు.

జనగామ రూరల్‌లో..

జనగామ రూరల్ : మండలంలోని వడ్లకొండ- గానుగుపహాడ్ క్రాస్ రోడ్డు వరదలకు కొట్టుకుపోయింది. దీంతో జనగామ-హుస్నాబాద్ రూట్‌లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఘటనా స్థలాన్ని ఆర్డీవో కొమురయ్య పరిశీలించారు. గానుగుపహాడ్ నుంచి వాహనాల రాకపోకలను మళ్లించారు. ఓబుల్ కేశ్వాపూర్‌లోని ప్రధాన రహదారిపై వర్షపు నీరు ప్రవహిస్తున్నది. సిద్దెంకిలోని మల్లెపురాయి గండి ప్రవహిస్తుండడంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. చెరువులు, కుంటలకు వరద లొస్తుండడంతో రైతులు వ్యక్తం చేస్తున్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి రూరల్ : భారీ వర్షాలతో దర్దేపల్లి-పాలకుర్తి రూట్‌లో కల్వర్టుపై వరద ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. గూడూరులో వరద ఉధృతిపై ఐబీ డీఈ శ్రీకాంత్‌శర్మ, ఏఈ సావంత్‌తో మాట్లాడారు. వావిలాలలో రోడ్డు తెగడంతో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ రాకేశ్ పూడ్పించారు. తొర్రూరు (జే)లో పసులాది వెంకన్న ఇల్లు కూలిపోవడంతో తహసీల్దార్, ఎంపీడీవో ఆవుల రాములు, ఆర్ఐ పరిశీలించారు. వాగుల ఉధృతిని కాంగ్రెస్ పాలకుర్తి నియోజక వర్గ ఇన్‌చార్జి హనుమండ్ల ఝాన్సీరెడ్డి పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. బ్రిడ్జి మంజూరైందని త్వరలో పనులు చేపడుతామన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో ప్రజలు బయటికి రావొద్దని సూచించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు ఆప్రమత్తంగా ఉండాలన్నారు. వాగులు వంకల మధ్య జాగ్రత్తగా ఉండాలన్నారు. పాలకుర్తిలో 102.2 వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. జనగామ డీసీపీ, వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య ఆదేశాల మేరకు ఎస్సై ఎం సాయి ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో వాగులు, వంకల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొడకండ్లలో..

కొడకండ్ల : వర్షాలతో నర్సింగాపురంలో ఇండ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. రామవరం చెరువును స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో వెంకన్న, వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, తహసీల్దార్ చంద్రమోహన్ పరిశీలించారు. జిల్లాలోనే అత్యధిక వర్షపాతం కొడకండ్లలో నమోదైందని తెలిపారు. అత్యవసర పరిస్థితులు ఉంటే కంట్రోల్ రూమ్ నంబర్ 9666 845714కు సంప్రదించాలన్నారు. ఇదిలా ఉండగా వరదలను ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

మాధాపురం గరికె చెరువు అలుగుపోస్తుండడంతో పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి రాము, తహసీల్దార్ హుస్సేన్

దర్దేపల్లి కల్వర్టుపై నీరు ఉధృతంగా ప్రవహిస్తుడడంతో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

బయ్యన్న వాగును పరిశీలిస్తున్న ఏసీపీ అంబటి నర్సయ్య, ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్ చంద్రమోహన్

లింగాలఘనపురం మండలం పటేల్‌గూడెం వద్ద వరదలకు కొట్టుకపోయిన రోడ్డు

కడవెండి వాగులో 120 గొర్రెలు గల్లంతు

బాధితులతో మాట్లాడిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

గొర్రెల కాపరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

దేవరుప్పుల, సెప్టెంబర్ 1: మండలంలోని కడవెండి వాగు ఉధృతిలో గొర్రెలు కొట్టుకుపోయాయి. ఎప్పటిలాగే ఆదివారం గొర్రెల పెంపకందారులు ఉప్పుల చంద్ర య్య,మహ్మద్ అంకూస్ 240 గొర్రెలను వాగు దాటిస్తుండగా నీటి ప్రవాహంలో వీటిలో సగం వరకు కొట్టుకుపోయాయి. గమనించిన రైతులు నీటిలోకి తాళ్లను విసరడంతో వాటి సహాయంతో ఉప్పుల చంద్రయ్య, అంకూస్ బయటకొచ్చారు. బాధిత గొర్రెల పెంపకందారుల కుటుంబాలను పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి పరామర్శించారు. వాగులో గొర్రెలు కొట్టుకుపోయిన విషయమై కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాతో ఫోన్లో మాట్లాడి ప్రకృతి విపత్తు కింద బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందేలా చూడాలని కోరారు. అనంతరం రాంచంద్రాపురంలో రోడ్డుపై వరదలను ఎమ్మెల్యే పరిశీలించారు. కోలుకొండ వాగులో గంగమ్మ తల్లికి పూజలు చేశారు. స్థానిక తహసీల్దార్ హుస్సేన్, ఎస్సై సృజన్‌కుమార్‌తో మాట్లాడి అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు.

పోతారంలో కూలిన ఇల్లు

తరిగొప్పుల : మండలంలోని పోతారంలో వంగపల్లి నర్సమ్మకు చెందిన పెంకుటిల్లు ఆదివారం కూలిపోయింది. ఇంట్లో నర్సమ్మతో పాటు భర్త వెంకటయ్య ఉంటున్నారు. వర్షాలతో ఇల్లు కూలిన సమయంలో వారు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరారు.

జోరుగా గణేశ్ మండపాల ఏర్పాటు

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 1 : గణేశ్ నవరాత్రి వేడుకలు సమీపించడంతో జిల్లా కేంద్రంలో భక్తులు జోరుగా గణేశ్ మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవ సమితి బాధ్యులు స్వామివారి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నా రు. తొమ్మిది రోజులు జరిగే ఉత్సవాల్లో పిల్లల నుంచి పెద్దల వరకు భాగస్వామ్యం అవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం జనగామ పట్టణంలోని 14 వార్డులో భక్తులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గణేశ్ మండపాన్ని నిర్మించారు. అందులో వినాయకుడి విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు విగ్రహాల కొనుగోలు కోసం విరాళాలను సేకరిస్తున్నారు. మండపాలకు ఉచిత కరెంట్ ఇస్తామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నేడు జిల్లాలోని విద్యా సంస్థలకు సెలవు : కలెక్టర్

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 1 : భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులు సోమవరం కలెక్టరేట్‌కు రావొద్దని ఆయన సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ విద్యా సంస్థలన్నింటికి సెలవు ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. నేటి సెలవు దినాన్ని ఈ నెల 14వ తేదీన రెండో శనివారం పని దినంగా విద్యా సంస్థలు పాటించాలని కలెక్టర్ ఆదేశించారు.

జనగామ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

ఉద్యోగ జేఏసీ నేతల డిమాండ్

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 1 : పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం (సీపీఎస్) అమలైన సెప్టెంబర్ ఒకటో తేదిని 'పెన్షన్ విద్రోహ దినం'గా జేఏసీ నాయకులు పాటించారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఉద్యోగులు నల్లచొక్కాలు ధరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడ ఖాజా షరీఫ్ మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ అమలు చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే వరకు ఉద్యమిస్తామని తెలిపారు. టీజీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ కొర్నేలియస్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం ఆర్థిక భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ ప్రధాన కార్యదర్శి పెండెల శ్రీనివాస్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రావు, ఆకుల శ్రీనివాస్‌రావు, పీఆర్టీయూటీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు మహిపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి, టీపీటీఎఫ్ అధ్యక్షుడు లక్ష్మయ్య, సీపీఎస్ నాయకులు లక్ష్మణమూర్తి, రాజు, టీఎన్జీవోస్, ఐఎన్‌టీయూసీ నాయకులు రామనర్సయ్య, రొండ్ల శ్రీనివాస్‌రెడ్డి, హమీద్, నాగార్జున, కనకయ్య, రవిందర్, అంకుషావళి, వేణు, శ్రీధర్, చందర్ పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు ఘనంగా బోనాలు

- దప్పుచప్పళ్లు, శివసత్తుల నృత్యాలు
- బచ్చన్నపేట, నర్మెట, రఘునాథపల్లిలో వేడుకలు

వెల్దండలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

అంకుషాపూర్‌లో బోనాలతో వెళ్తున్న మహిళలు

బచ్చన్నపేట/నర్మెట/రఘునాథపల్లి,సెప్టెంబర్ 1: బచ్చన్నపేట మండలం పోచన్నపేటలో బోనాల పండుగను రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పోచమ్మ తల్లికి నైవేద్యం, నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం డప్పుచప్పులు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలతో బోనాలు చేశారు. నర్మెట మండల కేంద్రంతోపాటు వెల్దండ, హన్మంతాపూర్‌లో పోచమ్మ తల్లికి ప్రజలు బోనాలు సమర్పించారు. పాడి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. రఘునాథపల్లి మండలం కోమల్లలో దళితులు ఎల్లమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో పూజలు చేసి పాడి పంటలు, పిల్లపాపలు ఆనందంగా చూడాలని అమ్మవారిని కోరుకున్నారు. తరిగొప్పుల మండలం అంకుషాపూర్‌లో పోచమ్మ, దుర్గమాత, ఎల్లమ్మ, పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. అన్ని కులాల వారు గ్రామ దేవతలకు పూజలు చేసి మొక్కులు చెల్లించారు. మరోవైపు ఆయా గ్రామాల్లో కుటుంబ సభ్యులు, బంధువులతో ఉత్సాహంగా గడిపారు. శ్రావణ మాస బోనాలతో సందడి నెలకొంది.